

# మలుపు

"ఒరే సుందరం ! ఈ ప్రపంచ చరిత్రనంతా తరచి చూసినా ప్రేమవల్ల బాధపడ్డవాళ్లు, ప్రాణాలు పోగొట్టుకున్నవాళ్ళేకాని, ప్రేమ పునాదులమీద సుఖ సౌధాలెవరూ నిర్మించుకోలేదురా !"

"నిన్ను బాధపెట్టాలనో, వర్ణాంతర వివాహాల నంగీకరించలేకనో నేనీ మాటలు చెప్పట్లేదు. అనుభవలేమివల్ల నీ జీవితాన్ని అనవసరంగా దుర్భరం చేసుకోవద్దనే ఇదంతా. ఇప్పటికైనా ఆ అమ్మాయి వివరాలు చెబితే పెళ్లికి ఒప్పించేందుకు నేను ప్రయత్నిస్తాను" అహాన్ని చంపుకొని, భేషజాన్ని వదులుకొని, కొడుకు బాధ చూడలేక మాధవయ్య ఆవేదన వెళ్ళబుచ్చాడు.

పి.జి. పూర్తిచేసిన సుందరం - ఆర్గానిక్ కెమిస్ట్రీలో గోల్డ్‌మెడలిస్ట్. చాలా తెలివైనవాడు. ప్రైవేట్ కాలేజీలో పనిచేస్తూ, ట్యూషన్స్ చెబుతూ బాగానే సంపాదిస్తున్నాడు. బి.ఇ.డి. కూడా పూర్తి చేసిన సుందరం ఇటీవల టీచర్స్ ఎంపిక కోసం ప్రభుత్వం నిర్వహించిన డి.ఎస్.సి. బాగా చేశాడు. ప్రభుత్వోద్యోగం గ్యారెంటీగా వస్తుందన్న నమ్మకముంది. తల్లిదండ్రులు కార్తీకమాసంలో అతనికి పెళ్ళిచేద్దామనే ఆలోచనలో ఉండగా, తానో అమ్మాయిని ప్రేమించానని, ఆమెనే చేసుకుంటానన్నాడు. ఆధునికత నాహ్వానించే లక్ష్మీ, మాధవయ్యలు కొడుకు కోరికను మన్నించారు.

కాని, అంతలోనే ఆ అమ్మాయి పెళ్ళికి అంగీకరించట్లేదని, తన ప్రేమను సైతం కాదని వెళ్ళిపోయిందని బాంబులాంటి వార్త పేల్చి వాళ్ళకు ఆందోళన మిగిల్చి, తాను విషాదంలో మునిగిపోయాడు.

కాలేజీకి వెళ్ళడం మానేశాడు, నిద్రాహారాలకు దూరమయ్యాడు, తల్లి ఆందోళన వ్యక్తం చేస్తే – "నన్నింకా ఇబ్బంది పెడ్తే, ఇంట్లోంచి వెళ్ళిపోతా"ననే బ్రహ్మాస్త్రంతో బెదిరించాడు. ఆ ఇంట్లో మనశ్శాంతి అనే పదార్థమే కరువై పోయింది.

తల్లిబాధ, తండ్రి బోధా అతనిపై ఏ ప్రభావమూ చూపలేక పోయాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఆపద్బాంధవుడిలా వచ్చాడు లక్ష్మి తోబుట్టువు, సుందరం మేనమామ సూర్యప్రకాశం. అక్క చెప్పిందంతా విని మొదట హతాశుడయ్యాడు.

తన కూతురు సుందరాన్ని చేసుకుంటే అందరికీ ఆనందంగా ఉంటుందని, పిల్లలిద్దరూ ఒకరంటే మరొకరు ఇష్టపడేవారే. ఆర్థిక పరమైన సమస్యలూ లేవు కాబట్టి, అంతా సజావుగా జరిగిపోతుందని, అక్కకు ఇదెంతో ఇష్టమైంది – సరదగా మాట్లాడిపోదామనుకొని వచ్చాడు. తీరా ఇక్కడి పరిస్థితంతా తలకిందులుగా ఉంది.

కూతురు పెళ్ళికంటే మేనల్లుడికి సాంత్వన మెంతో ముఖ్యమైన అవసరంగా గుర్తించాడు సూర్యప్రకాశం. అందుకే చీకటి ఏకాంతంలో ఉక్కిరిబిక్కిరవుతున్న సుందరాన్ని కదిపాడు.

"ఏమోయ్ ! ఈ మధ్య కథలు కవిత్వాలూ మొదలుపెట్టావా ?" అంటూ ఎంటరయ్యాడతని గది(మది)లోకి.

అనుకోని పరిశ్రమానికి ఉలిక్కిపడ్డాడు సుందరం. వెంటనే సర్దుకునే ప్రయత్నం చేశాడు – 'ఎప్పుడొచ్చావు మావయ్యా ?" చిన్ననాటి నుండి చనువెక్కువ, వారి మధ్య.

"ఇప్పుడేరా ! ఏదీ, కవిత్వమేనా ? నేను చూడొచ్చా ?" అంటూ అతని చేతిలోని ఫైల్ లాక్కోబోయాడు.

కంగారుగా ఫైల్ మూసేశాడు సుందరం.

" అబ్బే, ఏంలేదు మావయ్యా ! ఉత్తిదే !" మాటల్ని కూడగట్టు కున్నాడెలాగో.

అతని ప్రియురాలి ప్రేమలేఖ చిట్టా అది. ఆ సంగతి సూర్యప్రకాశం గుర్తించలేకపోలేదు.

"సర్సర్లే. అలా బయటికెళ్ళొద్దామా ?" మాట మార్చేశాడు వెంటనే.

"అలాగే మామయ్యా !" ఎంత తొందరగా బయటపడితే అంత మంచిదనిపించింది సుందరానికి. "నువ్వు హాల్లో వెయిట్ చేస్తూ ఉండు. రెణ్ణిమిషాల్లో తయారైపోతా"నంటూ హడవుడిగా లేచాడు.

ముసిముసిగా నవ్వుకుంటూ గది దాటాడు సూర్యప్రకాశం.

❃ ❃ ❃

"అయితే, మా దివ్యను చేసుకోనంటావ్ !" టాంక్‌బండ్ మీద సెనక్కాయలు నములుతూ నిట్టూర్చాడు సూర్యప్రకాశం.

"..........." తన నిస్సహాయతను మౌనంగా వ్యక్తం చేశాడు సుందరం.

"సర్లేరా, దానికోసం నువ్వేమీ బాధపడనక్కర్లేదు. నేను కూడా దానికి నీమీద లేనిపోని ఆశలేవీ కల్పించనూలేదు. దానికెక్కడ రాశాడో ఆ భగవంతుడు. మరి నీ సంగతేమిటి ?" కూపిలాగే ప్రయత్నంలో ప్రకాశం.

"నేనిప్పుడప్పుడే పెళ్ళి చేసుకోవాలనుకోవట్లేదు మావయ్యా !" ప్రకాశం కళ్ళలోకి చూడలేక తలదించుకున్నాడు.

"ఇప్పుడు చేసుకోవా, అసలు పెళ్ళే చేసుకోవా ?" సూటిగా అడిగాడు.

"........................."

"ఒరే సుందరం !, నా దగ్గరెందుకురా దాస్తావు ? పోనీ నువ్వు ప్రేమించిన ఆ ప్రత్యూషనే చేసుకోలేవూ ?"

దెబ్బతిన్నట్టు చూశాడు సుందరం.

"నాకన్నీ తెలిశాయిరా ! అయినా ఇబ్బంది ఏదైనా ఉంటే ఆ అమ్మాయికుండాలి గాని, నీకేంటిరా ? పైగా అక్కా బావా అభ్యంతరం కూడా లేదు. హాయిగా నచ్చిన పిల్లని, మనసిచ్చినదాన్ని పెళ్ళిచేసుకోక ఈ వేషాలేమిట్రా ?" ఆప్యాయంగా మందలించాడు.

అనుకోకుండా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి సుందరానికి.

"సుందరం ! ఈరోజే మనం ఆ అమ్మాయి వాళ్ళ ఊరెళ్దాం. విషయం తెలుసుకుందాం. వాళ్ళెవరైనాసరే ఒప్పించి, నేనీ పెళ్ళి జరిపిస్తాను......."

"మావయ్యా..... అది......."

"నువ్వింకేమీ చెప్పొద్దు. ఏదైనా ఒక సమస్యను మనసు పొరల్లో దాచుకుంటే అది కుళ్ళిపోయి, మనల్నీ కుళ్ళిపోయేలా చేస్తుంది. మనసు విప్పి మాట్లాడుకుంటే మంచులా కరిగిపోయి ఆనందప్రవంతిని మిగులుస్తుంది. అన్నీ అక్కడే మాట్లాడుకుందాం. నువ్వు మాట్లాడకుండా నా వెంబడొచ్చేసెయ్"

సుందరం కాదనలేకపోయాడు.

❊ ❊ ❊

వరంగల్ నుండి మామాఅల్లుళ్ళు తిరుగు ప్రయాణం చాలా భారంగా ప్రారంభమైంది. రైలు జనగాం దాటేదాకా ఇద్దరూ ఒక్కమాట కూడా మాట్లాడలేకపోవడం పరిస్థితికద్దం పడుతోంది.

"ఈ విషయాన్నింతటితో మరచిపోవడం మంచిదిరా !" సుందరాన్నుద్దేశించి మౌనాన్ని ఛేదించాడు ప్రకాశం.

సమాధానంగా ఓ నిట్టూర్పు విడిచి, కిటికీలో నుండి బయటకి చూడసాగాడు సుందరం.

"మొదట్లో నువ్వా అమ్మాయి గురించి చెప్పినపుడు. స్థిరచిత్తంలేని మనిషిని, 'క్షణ క్షణముల్ జవరాంద్రచిత్తముల్' అన్న రివాజులోనిదేనేమో అనుకున్నాను. అంగీకరిస్తే పెద్దవాళ్ళను ఒప్పించిగాని, నొప్పించైనా సరే మీ పెళ్ళి చేయాలని, అంగీకరించకపోతే ఆ అమ్మాయి వ్యక్తిత్వం నువ్వర్థం చేసుకొని మారతావనీ ఆశించాను. కాని, రెండూ నెరవేరలేదు. ఒక్కటి మాత్రం నిజం - ఎదిగిన ఆమె మనస్సునర్థం చేసుకున్నాక కన్నకూతురుకంటే ఎక్కువ అభిమానం ఏర్పడిందా అమ్మాయి మీద" గుండె పొరల్ని చీల్చుకొని వచ్చిన ఆ మాటల్లో చెమరింపు.

మెదడుకు, మనసుకు సమన్వయం కుదరక అసహనంగా కదిలాడు సుందరం.

మరోసారి ప్రత్యూష మాటలు సూర్యప్రకాశం అంతరంగంలో ప్రతిధ్వనించాయి. ..... "చూడండి బాబాయిగారూ ! సుందరాన్ని నేను ప్రేమించాను, ఇప్పటికి ప్రేమిస్తూనే ఉన్నాను. ప్రేమ జీవితంలో భాగమే కాని, జీవితమే ప్రేమకాదు. నా ప్రేమకోసం అమ్మా నాన్నల్ని బాధపెట్టలేను. వాళ్ళకు నేను ఏకైక సంతానాన్ని. ఇల్లరికపుటల్లుడైతేనే వారి శేషజీవితం అనుకున్నట్టు సాగుతుంది. అందుకు అన్ని విధాల యోగ్యుడైన అల్లుడ్ని వాళ్ళే ఎన్నుకోవాలి.

"ఆ వచ్చిన వాడ్ని నేను ప్రేమించగలనా, లేదా అనే ప్రశ్నకు కాలమే సమాధానం చెబుతుంది. తల్లిదండ్రుల పట్ల కొడుకులకెంత బాధ్యత ఉంటుందో కూతురికీ ఉండ నక్కర్లేదా ? పైగా మా అమ్మా నాన్నలకి కొడుకునైనా, కూతుర్నైనా నేనే కదా ! వాళ్ళ ఆనందం కోసం నా ప్రేమను త్యాగం చేయడంలో నాకు మిగిలే తృప్తి వెలకట్టలేనిది. ప్రేమ త్యాగాన్ని కోరుతుందంటారు. అదే నిజమైతే ఈ త్యాగం చెప్పుకోదగిందీ కాదు...."

"మావయ్యా ! ప్రేమించిన వాళ్ళనంత తేలిగ్గా మరచిపోవడం సాధ్యమేనా ?" సూర్యప్రకాశం ఆలోచనలకడ్డు తగుల్తూ అంతర్మథనాన్ని బయటపెట్టాడు సుందరం.

వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు ప్రకాశం. కొద్దిసేపు మౌనం తర్వాత సాలోచనగా చెప్పసాగాడు.

"స్త్రీ పురుషుల మధ్య ప్రేమ ఆకర్షణ ప్రాతిపదికగా ఏర్పడుతుంది. ఆపై ఒకరిపట్ల మరొకరికి అభిమానం, ఆరాధన పెరిగి ఆ బంధం దృఢమౌతుంది. క్రమేణా వికాసం చెంది, అంతరంగాలను ముడివేస్తుంది. ఆ తర్వాత కలిసి జీవించాలనే తీవ్రమైన కాంక్షకు తెరతీస్తుంది."

"చిత్తశుద్ధిలోపం, వైమనస్యతల వల్ల చాలా ప్రేమలు ఆరంభంలో, కొన్ని మధ్యలో వీగిపోతాయి....... కాని, మీ ప్రేమ అలాంటిది కాదు. ఒక ఆదర్శం కోసం ఒకరి త్యాగానికి మరొకరు సహకరించే......"

"లేదు మామయ్యా నేను ప్రత్యూష ఆలోచన నంగీకరించలేక పోతున్నాను" అసహనంగా అడ్డుకున్నాడు సుందరం.

"ఔన్రా ! అదే మేల్ ఇగో. ప్రపంచమెంతగా సంస్కరణలకు లోనవుతున్నా మగాడి అహంకారమింకా దిగిపోవడం లేదు. నిన్నూ, నీ అభిప్రాయాల్ని ప్రత్యూష అనుసరించాలని ఎలా భావిస్తున్నావో, ఆమె పరిస్థితులనర్థం చేసుకొని నీవూ గౌరవించవచ్చు కదా ! పోని, ఆ అమ్మాయిపట్ల ప్రేమ చంపుకోలేని వాడివే అయితే ఇల్లరికపుటల్లుడిగా ఉండిపో !" కూల్‌గానే చెప్పాడు సూర్యప్రకాశం.

నిర్వేదంగా ఉండిపోయాడు సుందరం.

గాయపడ్డవాడ్ని మరింత బాధపెడ్తున్నానేమో అనుకున్నాడు ప్రకాశం. మెల్లగా అనునయించసాగాడు.....

"సంగారెడ్డిలో నా మిత్రుడొకడున్నాడు - మాణిక్య ప్రభు. అతని ఔదార్యాన్ని వింటే, నీలో గూడుకట్టుకున్న కల్మషమంతా కరిగిపోతుంది.

ఏమిటన్నట్టు ఆసక్తిగా చూశాడు సుందరం.

"ఆయన బ్రహ్మచారిగా జీవితం గడుపుతున్నకాలంలో ముగ్గురు పిల్లల తల్లి ఒకావిడ భర్తతో వచ్చిన విభేదాల వల్ల రోడ్డున పడ్డది. ఆవిడకు నీడనిచ్చి, ఆ పిల్లలకు తాను తండ్రిగా నిలిచి, జీవితంలో పోగొట్టుకున్న ఆనందాన్ని, తృప్తినీ యిచ్చి ఎంతో గౌరవించాడు, చివరికి మునుపటి భర్తతో చట్టబద్ధంగా విడాకులిప్పించి, ఆమె మెడలో తాళిగట్టి ఏలుకునేందుకు సిద్ధమయ్యాడు."

"ఇదంతా నిజమా ?" అన్నట్టు చూశాడు సుందరం.

"ఇదంతా నేనేదో కల్పించి, కథ చెబుతున్నాననుకుంటున్నావు కదూ !" కాదు. ఇది నిజం. ఆ వ్యక్తిని నీకు పరిచయం చేస్తాను"

"నిజంగా ఆయన్ని చూడాలని ఉంది. ఇప్పుడంతా హాయిగా ఉన్నారా ?" సుందరం ఆరాటం.

"ఆ ! ఒకరకంగా హాయిగానే ఉన్నారు. కాని, విడివిడిగా"

"అదేం ?"

"అదేమరి. ధనికుడైన భర్త తన తప్పు గ్రహించి, పిల్లల్ని ప్రలోభపెట్టి, భార్యను క్షమాభిక్ష కోరి తనవైపుకు తిప్పుకున్నాడు."

"అయితే, ఆవిడ లొంగిపోయిందా ?"

"పిల్లల భవిష్యత్తు, ఆర్థిక స్థితి, భర్త చాటు జీవితంలోని భద్రత ఆమెను (మొదటి) భర్త వెంట వెళ్ళేలా చేశాయి.

"ఆడవాళ్ళంతా ఇంతేనా మావయ్యా ? దీర్ఘంగా ఆలోచిస్తూ అడిగాడు సుందరం.

"నువ్వింకా 'మగాడి'గానే ఆలోచిస్తున్నావురా ? స్త్రీ హృదయాన్ని, సమాజంలో ఆమె స్థితినీ అర్థం చేసుకొమ్మని చెబుతున్నాను. ప్రేమకోసం ప్రాణత్యాగానికి పాల్పడ్డ ఆడవాళ్ళూ ఉన్నారు. శారదగారని, మా ఊరే....."

"ఎవరూ ? జితేంద్ర వాళ్ళ అమ్మగారేనా ?" ఠక్కున గుర్తు కొచ్చింది సుందరానికి.

"ఆ" ఆవిడే, ఇరవై ఒకటోయేట - అంటే ఆమె పెళ్ళైన నాలుగేళ్ళకే భర్త యాక్సిడెంట్‌లో చనిపోయాడు. ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన భర్త మరణాన్ని తట్టుకోలేక, పదినెల్ల పసిగుడ్డుని పట్టుకొని, బావిలో దూకింది.

"కాని, కాలం ఆమెకు మరో శాపమిస్తూ, ఆ పసిదాన్ని తనతో పట్టుకెళ్తూ, ఆమెను జీవచ్ఛవంగా మార్చేసింది."

"ఆ తర్వాత ?"

"ఏముందీ ? మిగిలిన ఒక్కగానొక్క కొడుకు జితేంద్రలోనే భర్తనూ, బిడ్డనూ చూసుకుంటూ జీవితంతో రాజీపడిపోయింది."

మాటల్లో ఉండగానే రైలు సికింద్రాబాద్ చేరుకుంది. రెండో నెంబరు ప్లాట్‌ఫారం మీద దిగారు సుందరం, ప్రకాశం. అంతలోనే ఏవో అరుపులూ, కేకలూ వినిపిస్తున్నాయి. మూడో నెంబరు ప్లాట్‌ఫాం పైనుండి.

గబగబా అటు పరుగెత్తారు.

నాలుగేళ్ళ అబ్బాయి - మూడో నెంబర్ ట్రాక్ మధ్యన నిల్చొని ఏడుస్తున్నాడు.

నాలుగో నెంబర్ ట్రాక్ మీది బండి బయలుల్దేరుతుందన్న కంగారులో తల్లి ఆ పిల్లవాడ్ని వెంటబెట్టుకొని మూడో ట్రాక్ మీది నుండి అటు వెళ్ళి రైల్లో సామాను పెట్టి, పిల్లాడికోసం చూసింది. అప్పటికి వాడింకా మూడోట్రాక్‌పైనే ఉన్నాడు. అదే సమయంలో ఆ ట్రాక్ మీదికి దూసుకోకొస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలును చూడలేదు. పైగా ప్రయాణీకులంతా గోలగోలగా అరుస్తుండడంతో మరింత కంగారుపడిపోయి, బిగ్గరగా ఏడుస్తూ మెదలకుండా ఉండిపోయాడు.

మరో క్షణంలో రైలు పిల్లవాడిని తాకుతుందనగా సుందరం గభాల్న దూకి పిల్లాడ్ని తీసుకొని అవతలికి దొర్లాడు.

❊ ❊ ❊

కళ్ళు తెరిచిన సుందరానికి తల బరువుగా అనిపించింది. ఏదో కట్టుకట్టబడి ఉంది. మరికొద్ది క్షణాల్లో - తానేదో హాస్పిటల్లో ఉన్నాడని, అమ్మా, నాన్న, మావయ్య, … మరో స్త్రీ మూర్తి తనను పర్యవేక్షించి ఉన్నట్టు తెలుసుకున్నాడు.

తనవాళ్ళంతా ఆప్యాయంగా పలకరించాక......

"బాబూ ! మీరు నా పాలిట దేవుడు !" అంటూ కాళ్ళమీద పడి పోయింది ఆగంతకురాలు.

కంగారుపడ్డాడు సందరం. తల్లి లక్ష్మి ఆవిడ్ని లేవనెత్తింది.

"అమ్మా ! ఏమిచ్చినా ఈ పుణ్యాత్ముడి ఋణం తీర్చుకోలేనమ్మా. నాబిడ్డకి చీమకుట్టినంత గాయం కూడా కాకుండ కాపాడిన దేవుడు నీ బిడ్డ. ఇలాంటి వాళ్ళు వెయ్యేళ్ళు చల్లగా ఉండాలి......" సాగిపోతోందామె వాక్ప్రవాహం.

"అంటే ప్రమాదం మరికాస్త తీవ్రమయుంటే నేను చచ్చిపోయేవాణ్ణే. జీవితమెంత అల్పమైంది. ఈ మాత్రం దానికి ప్రేమకోసం, ప్రియురాలికోసం అంటూ ఇంకా అల్పమైన విషయాలకోసం దేవుడిచ్చిన జీవితాన్నీ, కాలాన్నీ ధారపోయడం పిచ్చిపని."

"తను చేసిన ఒక చిన్నసాయం ఆమె దృష్టిలో తనని దేవుడ్ని చేసింది. నిస్వార్థంతో చేసే ఎంత చిన్న సాయమైనాసేవే. సేవద్వారా లభించే తృప్తిని ఈ ప్రపంచంలో మరేవిధంగానూ పొందలేము.

"మిగిలిన జీవితాన్ని సమాజసేవకు అంకితం చేయాలి. దళితులు, పతితలు, బాధాకలితులు అంటూ కవితలల్లడంకాదు, పాటలు పాడటం కాదు. వివేకానందుడు చెప్పినట్లు దరిద్రనారాయణుల సేవకు తన వంతు ప్రయత్నం చేయాలి" కళ్ళు తెరిచి చూశాడు, ఎదురుగా ఆ తల్లి.

"అమ్మా ! నీవు నాకు దండం పెట్టడం కాదు. నేనే నీకు చేతులెత్తి మొక్కాలి. నాలోని అజ్ఞానాన్ని కడిగేసి, కర్తవ్యాన్ని మేల్కొలిపిన దివ్య స్వరూపిణివి !" మనసులోనే ఆ మాతృమూర్తికి పాదాభివందనం చేశాడు సుందరం.

**(12 నవంబర్ 2001, జాగృతి దీపావళి ప్రత్యేక సంచిక)**